కథ

# దారేటు?

జి.ఎస్.లక్ష్మి



**చీకటి... కటికచీకటి... కళ్ళు పొడుచుకున్నా కనపడనంత చీకటి. ఆ చీకటిలో చిన్నశబ్దం... చాలా చిన్నశబ్దం. ఎవరికీ వినపడకుండా నోరునొక్కుకుని పెడుతున్న వెక్కిళ్ళ శబ్దం. అంత చీకటిలో అంత నిశ్శబ్దంలో ఆ సన్నని వెక్కిళ్ళు వినపడుతుంటే అదోకలాంటి భయం. బెంగ, వెన్నుపూస లోంచి వణుకు. బలవంతంగా తెరుద్దామనుకుంటున్న కళ్ళని బలంగా మూసేసుకోవాలన్న ఆత్రం. వెక్కిళ్ళు వినపడకుండా వుండాలని చెవులు, వెక్కిళ్ళు పెడుతున్న అమ్మని చూడకుండా వుండాలని కళ్ళు, బలవంతంగా మూసుకున్న గాయత్రికి తెల్లగా తెల్లారితే కాని మెళకువ రాలేదు. మెళకువొచ్చాక చూస్తే యేముంది... అమ్మలేదు... అందనంత దూరాలకి వెళ్ళిపోయింది...**

ఉలిక్కిపడిలేచింది గాయత్రి మంచం మీంచి. గబగబా ఫ్రిజ్‌లో నీళ్ళు తీసుకుని తాగి టైము చూసింది. తెల్లవారగట్ల మూడున్నర. ఇంకింతే. యివాల్టికింక నిద్రపట్టదు.... ఎంత కాలమిలా? నీరసంగా కుర్చీలో కూలబడిపోయింది. ఎప్పుడో ఇరవైయేళ్ళ క్రిందటి సంఘటన. అప్పుడు తనకి యేడేళ్ళ కన్నలేవు. మెదడు లోపలి పొరల్లో ఎక్కడో గాఢంగా పడిన ఆ ముద్ర ఇప్పటికీ తనని అర్ధరాత్రిళ్ళు ఉలిక్కిపడి లేచేలా చేస్తోంది.

అమ్మమ్మ, తాతయ్యల చల్లని వాత్సల్యంతో పెరగడం, దరిమిలా చదువు, పరీక్షలు, వుద్యోగం వీటితో అసలు చాలా సంవత్సరాల నుంచి ఈ కల రావటం లేదు. మళ్ళీ ఇవాళిలా... ఎంతమంది డాక్టర్ల దగ్గరో తీసుకున్న కౌన్సిలింగుతో చాలావరకు పాజిటివ్ థింకింగ్ లోకి మారిన గాయత్రికి ఈ మధ్య మళ్ళీ నెగెటివ్ ఆలోచనలు ఎక్కువవుతున్నాయి.

ఎందుకు? తనని తనే ప్రశ్నించుకుంది యిరవైయేడేళ్ళ గాయత్రి. తనకున్న ప్లస్ పాయింట్లన్నీ మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంది. కాస్త మనసు సర్దుకున్నట్లనిపించింది. లేచి, బ్రష్ చేసుకుని కాఫీ పెట్టుకు తాగుతుంటే సెల్ ఫోన్ మోగింది.

ఎవరా అని చూస్తే తాతయ్య. వెంటనే ఆన్ చేసింది.

''అమ్మడూ, ఎలా వున్నావురా?'' ఆప్యాయంగా తాతయ్య పలకరింపు.

''బాగున్నాను తాతయ్య, ఏంటి సంగతి?''

''అబ్బే యేం లేదమ్మా, యివాళ సాయంత్రం నీకేమైనా వీలవుతుందేమోనని'' అర్థమైపోయింది గాయత్రికి. అంటే రేపెవడో పెళ్ళి కొడుకు చూసుకుందుకు వస్తాడన్నమాట.

''కుదర్దు తాతయ్యా, ప్రాజెక్టు ఎండింగ్‌లో వుంది. యేం, యేమైనా పనుందా?''

తాతయ్య కాసేపు మాట్లాడలేదు. అమ్మమ్మ అందుకున్నట్టుంది ఫోను.

''పనిలా అనిపిస్తోందిటే నీకు? పాతికేళ్లు దాటాయి, యింకా యెప్పుడు చేసుకుంటావే...''

''అమ్మమ్మా, ముప్ఫై యేళ్లు దాటిన వాళ్ళున్నారిక్కడ పెళ్ళిళ్ళు కాకుండా''

''అందరి సంగతీ నాకెందుకు? నీ సంగతి చెప్పు. నీ ఆఫీసు అయ్యాకే కలుస్తాడులే ఆ పిల్లవాడు. తాతయ్య నీకు అన్నీ చెప్తారు. కాస్త బుర్ర దగ్గరుంచుకుని మాట్లాడు''.

అమ్మమ్మ ధోరణి అలవాటైన గాయత్రి నవ్వుకుంది. తాతయ్య ఫోన్ తీసుకుని, ఆ కుర్రాడి వివరాలు చెప్పి, గాయత్రి ఫోన్ నంబర్ యిచ్చినట్లూ, ఏ టైముకి ఎక్కడ కలిసి మాట్లాడుకోవాలో చూసుకోండన్నట్టూ చెప్పారు. ఆఖరిగా తాతయ్యన్న మాట గాయత్రి మనసుని కుదిపేసింది.

''అమ్మడూ, నువ్వు ఈ తరంలో నాలుగు రకాల మనుషుల మధ్య బతుకుతున్న దానివి. మంచీ, చెడూ అన్నీ తెలుసు. తొందరపడి ఏ నిర్ణయానికీ రాకు. బాగా ఆలోచించుకో. ఒకసారి మేం తిన్న దెబ్బ మళ్ళీ తినలేం'',

బాధగా ఫోన్ ఆఫ్ చేసింది. నిజమే... అమ్మమ్మ, తాతయ్య ఎంతో గొప్పగా అమ్మకి పెళ్ళిచేసి, అల్లుడు పెట్టే బాధలు భరించలేక కూతురు ఆత్మహత్య చేసుకుంటే, అప్పట్నించీ కొండంత దుఃఖం గుండెల్లో పెట్టుకుని తనని పెంచి, యింతదాన్ని చేసారు. అప్పట్నించీ యిప్పటివరకూ మళ్ళీ తండ్రి మొహం చూడలేదు తను. కాపురం చేసినన్నాళ్ళూ తన తల్లిని తండ్రిపెట్టిన బాధలు అప్పుడప్పుడు అమ్మమ్మ చెప్తూండేది. అందుకే చిన్నప్పట్నించీ తనకి పెళ్ళన్నా, పెత్తనం చేసే మొగుడన్నా ద్వేషం. తాతయ్య, అమ్మమ్మల ప్రేమతో చక్కగా చదువుకుని, అందివచ్చిన అవకాశాలను అందుకుని ఒక మల్టీనేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా చేస్తోంది. ఈ ప్రపంచమే వేరు. ఎంతచక్కగా పలకరించుకుంటారో వ్యక్తిగత విషయాలకి అంతదూరంగా వుంటారు. ఒకసారి పనిలో పడితే మరింక వేరే ఆలోచనలే వుండవు.

ప్రాజెక్టు పనిలో పూర్తిగా మునిగిపోయిన గాయత్రి సిస్టమ్ మీద పాప్ అయిన మెసేజ్ చూసి ఆశ్చర్యపోయింది. అది నవత దగ్గర్నుంచి.

''హాయ్... యిట్స్ సో యెక్సైటింగ్... బై...''

హాసినీ, ఈ నవత కెంత ధైర్యం? పెళ్ళి కాకుండానే ఎవరో అబ్బాయితో కలిసివుంటూ యెక్సైటింగ్ అని మెసేజ్ పంపుతుందా... మొబైల్ మళ్ళీ మోగింది.

## Story

''హాయ్'' చేసింది పెళ్ళికొడుకని తెలిసిపోయింది.

''హాయ్, అయామ్ దుష్యంత్... మీ తాతగారు మీ గురించి చెప్పారు. మీ కెప్పుడు వీలవుతుంది మనం కలవడానికి?''

''సారీ... మీరేమీ అనుకోవద్దు. నాకసలు మనం కలవడం అనవసరం అనిపిస్తోంది. ప్లీజ్, డోంట్ కాల్ మీ అగైన్...'' అని ఫోన్ పెట్టేసింది.

షాకయ్యుంటాడు గురుడు. లేకపోతే ఒకసారి కలిసి మాట్లాడినంతలో యేం తెలుస్తుందని? తన హాబీస్ యేంటో అడుగుతాడు. అతని హాబీస్ యేంటో చెప్తాడు. ఆకాసేపూ యెంతో మర్యాదగా మాట్లాడతాడు. కాని రేపొద్దున్న మొగుడయ్యాక అసలు సిసలు మగాడే అయిపోతాడు.

''ఎవరితో గాయత్రీ అంత బ్లంట్‌గా మాట్లాడుతున్నావ్?''

పక్క సీట్లో రజని అడిగింది. రజని గాయత్రి కొలీగ్ మాత్రమే కాదు. కాలేజీలో క్లాస్ మేట్ కూడా . మంచి ఫ్రెండ్స్.

''యేంవుంది, వ నా వ ునా లే ... మళ్ళీ ఎవరో పెళ్ళికొడుక్కి నా నంబరిచ్చారు మా తాతయ్య''.

''పోనీ వాళ్లు చెప్పినందుకైనా ఒకసారి కలిసి మాట్లాడొచ్చు కదా... ఆ తర్వాత చెప్పొచ్చు నచ్చలేదని..''

''ఈ డ్రామాలు కూడా యెందుకు టైమ్ వేస్ట్. అయినా ఇవాళ సునీల్‌తో డిన్నర్‌కి వెడుతున్నాను''.

''ఓహ్... గుడ్... సునీల్ కూడా మంచి కుర్రాడే. పెళ్ళి గురించేమైనా మాట్లాడుతున్నాడా?''

''ఏం మంచి... గడమంచి... అతనికి కూడా యింక కలవొద్దని చెప్పడానికే వెడుతున్నాను''

''అదేంటే? బానే వుంటాడుగా... మంచి జాబ్ కూడానూ..''

''నిజమే... కాని రేపు పెళ్ళయ్యాక నేను నా జాబ్ హైద్రాబాద్‌కి మార్చుకోవాల్ట...''

''అందులో తప్పేవుంది? అతని జాబ్



అక్కడే కదా...''

''అదే నాకు మండేది. యేం. నా జాబ్ యిక్కడే కదా... అతనే యిక్కడికి రావచ్చు కదా...''

''మరామాట అడగలేక పోయావా?''

''అడిగాను. అక్కడ వాళ్ళ పేరెంట్సు వున్నార్ట. అందుకని నేనే అక్కడికొస్తే బాగుంటుందన్నట్టు మాట్లాడాడు''.

''అందులో తప్పే వుందే? పెళ్ళి చేసుకునేది ఇద్దరూ ఒకచోట కలిసుండాలనే కదా''

''ఛ... వూరుకో... ఇప్పుడే ఇలా మాట్లాడిన వాడు రేప్పొద్దున్న మా పేరెంట్సుకి నువ్వు జాబ్ చెయ్యడం యిష్టం లేదు, మానెయ్యి అన్నా అంటాడు''.

''అలా ఎందుకంటాడే?''

''ఏం... ఎందుకనకూడదు? నిన్ను చూడ ట్లేదూ?'' విసురుగా సమాధానం వచ్చింది గాయత్రి నుంచి. మరింక మాట్లాడలేక పోయింది రజని. నిజమే... రజని పరిస్థితి అలాగే వుంది. రజని మంచి కుటుంబంలో పుట్టిన అమ్మాయి. చక్కగా చదువుకుంది. అమ్మ, నాన్న తెచ్చిన సంబంధాన్ని తలొంచుకుని చేసుకుంది. మొగుడు ఉద్యోగం చెయ్యమన్నాడని చేస్తోంది. రోజూ పొద్దున్నే ఆఫీసుకి అతనే వచ్చి దించి వెడతాడు. మళ్ళీ సాయంత్రం తీసికెళ్ళడానికి వస్తాడు. అతని కేంటో మొదటి పరిచయంలోనే గాయత్రి మాటా పద్ధతీ నచ్చలేదు. అందుకని రజనిని గాయత్రితో మాట్లాడొద్దంటాడు. నిజంగానే రజని గాయత్రితో మాట్లాడదు అతను ఎదురుగా వున్నంత సేపూ. ఇదంతా చూస్తుంటే గాయత్రికి ఒంటికికారం రాసు కున్నట్టుంటుంది. తనకొచ్చిన ఉక్రోషాన్నంతా పని మీద చూపించడం మొదలు పెట్టింది. సిస్టమ్ ఊరు కుంటుందా... అన్నీ తప్పులు చూపించడం మొద లుపెట్టింది. ఇది పని కాదని గాయత్రి బాగా ఊపిరి పీల్చుకుని నెమ్మదిగా వదలడం మొదలు పెట్టింది. కాసేపటికి తనని తాను సముదాయించుకుంది. బల వంతంగా రజనీని కూడా లేవదీసి కాఫీకి తీసు కుపోయింది.

ఇద్దరూ కాఫీ తెచ్చుకుని కూర్చోగానే గాయ త్రికి మొబైల్‌లో సంపత్ దగ్గర్నుంచి మెసేజ్ వచ్చింది.

''హాయ్... గాయ్... ఇప్పుడు నేను బెంగుళూ ర్‌లోనే వున్నాను. ఎక్కడ ఎప్పుడు కలుద్దాం?''

''ఛీ, వీడొకడు''.

''ఎవరే?''

''వాడే, సంపత్. కలిసినప్పుడల్లా కలిసుందాం రా... అంటూంటాడు. ఇప్పుడిది చాలా మామూలై పోయిందంటాడు.

నచ్చినన్నాళ్ళూ కలిసుండొచ్చుట... ఎప్పుడు నచ్చకపోతే అప్పుడు విడిపోవచ్చుట. ఫ్రీబర్డ్ లాగా అన్నమాట. వినడానికి బానే వుంది కాని నిజంగా ప్రయోగం చేస్తే...''

''పోనీ, ఆ ప్రయోగమేదో చేసి చూడు'' నువ్వుతూ అంది రజని.

''నేనంటే నీకంత వేళాకోళంగా వుందా?''

''వేళాకోళం కాదే. నిన్ను చూస్తే జాలేస్తోంది''.

''జాలా? నన్ను చూసా? నాకేం తక్కువని?''

''అదిగో... అదే... ఆ అనుకోవడం చూస్తేనే జాలి. నిజానికి నీకేమీ తక్కువ కాదు. కాని ఇలా తక్కువ కాని వాళ్ళు వేల మంది వున్నారు తెలుసా?''

''అంటే''.

''అంటే, ఈ రోజు మీకు చేతిలో మంచి ఉద్యోగం వుంది. ఆర్థికంగా మీరు అనుకున్న దాని కన్న ఎత్తులో వున్నారు. అదొక్కటే జీవితమనుకుం టున్నారు. ఇలా ఎన్నాళ్ళు? మరో అయిదేళ్ళు, మహా అయితే మరో పదేళ్ళు. ఆ తర్వాత? యింట్లో అన్నీ వుంటాయి. ఒక్క కావలసినతోడు తప్ప''.

''అంటే? ఎవరు చేసుకుంటానంటే వాళ్ళని చేసుకోమంటావా?''

''అదిగో, అడ్డంగా వాదించి నీ మనసుని మభ్యపెట్టుకోకు. అసలు నీకు పెళ్ళంటే భయం. ఆ నిజాన్ని నిర్భయంగా ఒప్పుకో''.

''నాకా? భయమా?''

''అవును. భయమే. పెద్దలు కుదిర్చిన పెళ్ళైతే అతనెలాంటి పెత్తనం చేస్తాడోనని భయం. ప్రేమించి పెళ్ళిచేసుకుందుకు అతను రేపెలా మారి పోతాడోనని భయం. పోనీ సంతోష్ అన్నట్టు కలి సుందా మంటే దానికీ భయమే. అసలు నీ జీవితం లోకి మరో వ్యక్తిని ఆహ్వానించడానికే భయ పడుతు న్నావు. ఇది మంచిదంటావా?''

''సరే. నువ్వన్నట్టు భయమేననుకో. అలా నేను భయపడ్డానికి కారణం లేదంటావా?''

''వుండొచ్చు. కానీ ఆ కారణం నీ జీవితాన్నే అసంపూర్తిగా మిగిలిస్తుందేమోనని అనిపిస్తోంది. చూడు గాయత్రీ, మగవాళ్ళందరూ... పోనీ నీ మాటల్లో చెప్పాలంటే మొగుళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదు''.

''అంటే మీ అయన కూడా మంచి వాడేనం టావా?''

''కాదా? నా మొగుడేమీ దుర్మార్గుడు కాదే... తాగుబోతు కాదు, జూదరి కాదు. ఎటొచ్చీ మొగు డన్న వాడు ఇలాగే వుండాలని కొన్ని ఆలోచనలున్న వాడు. అందుకని నీకు అతనంటే కోపం''.

''ఏమో, నాకెవరైనా ఇలా చెయ్యి అంటే నచ్చదు. నాకు ఒకళ్ళు చెప్పడమేంటే అనిపిస్తుంది. స్వేచ్ఛగా, హాయిగా వుండాలనిపిస్తుంది''.

''స్వేచ్ఛ, స్వతంత్రం అంటే యేంటి? నాకు స్వతంత్రం వుందని పక్కింటిమీద రాళ్ళేస్తే అది స్వతంత్రమవుతుందా? దేనికైనా 'నేనలా సర్దుకో లేను''.

''సర్దుకోలేనప్పుడు సంఘర్షణ తప్పదు. కాని యేం ఆలోచించి చేసినా భవిష్యత్తు దృష్టిలో పెట్టు కోమనిమటుకు చెప్పగలను''

''థాంక్స్ ఫర్ యువర్ అడ్వైజ్'' అంటూ పనిలో పడిపోయింది గాయత్రి.

సాయంత్రం పని పూర్తవడానికి గాయత్రికి కొంచెం లేటయింది. ఈ లోపల రజని భర్త వచ్చి ఆమెను తీసికెళ్ళిపోయాడు. ఆరుదాటాక బైటకొచ్చిన గాయత్రికి అక్కడ సంతోష్ ఎదురుచూస్తూ కనప డ్డాడు.

''హాయ్'' గాయత్రిని చూడగానే పలకరిం చాడు.

''హాయ్'' మొహం ముడుచుకుని సమాధానం చెప్పింది.

''చాలా టైరయినట్టు కనిపిస్తున్నావ్. ఎక్కడైనా కాఫీ తాగుదాం పద''

సునీల్‌తో డిన్నర్ మాట గుర్తొచ్చింది.

''సారీ సంపత్, వేరే ప్రోగ్రాముంది''.


నిరుత్సాహ పడ్డాడు సంపత్. అంతలోనే సర్దు కుని ''యిట్స్ ఓకే. ఇదిగో ఈ పేపర్లుంచు. రేపు కలుద్దాం'' అంటూ కొన్ని పేపర్లిచ్చాడు.

''ఏంటివి?''

''అదే... మనిద్దరం కలిసుండాలంటే ఒక అండర్ స్టాండింగ్ రావాలి కదా... దాని గురించి... ఇవాళో సారి చూడు. రేపు మాట్లాడుకుందాం''.

ఆ కాగితాలందుకుని తన స్కూటీ వైపు నడి చింది. వెనక్కి తిరిగి సంపత్ మొహం చూడాలన్న ఆలోచనని బలవంతంగా ఆపుకుంది. ఏమనుకుం టుంటాడు? ఇదేకనక మొగుడయ్యుంటే ''ఏం ప్రోగ్రాం? ఎవరితో? అంత అవసరమా? ఇప్పుడు వెళ్ళక పోతేనేం?'' అనే ప్రశ్నలు వచ్చేవి. అలా మొగుడిలా కాకుండా ఇలా కలిసుంటే అలాంటి ప్రశ్నలడిగే ఆస్కారం లేదేమో కదా... ఇదేదో బాగు న్నట్టే వుంది. ఇంటికెళ్ళి ఈ పేపర్లో ఏముందో శ్రద్ధగా చూడాలి అనుకుంది.

ఆలోచిస్తూ రెస్టారెంటు కెళ్ళిన గాయత్రికి



అక్కడ సునీల్ ఎదురు చూస్తూ కనిపించాడు. గాయత్రి చెప్పే సమాధానం కోసం చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నట్టనిపించాడు. చాలా మర్యాదగానే తన అభిప్రాయం చెప్పింది గాయత్రి. బెంగుళూరులోనే వుండాలనుకుంటోందనీ, హైదరాబాదు మకాం మార్చే ప్రసక్తేలేదనీ తేల్చి చెప్పింది. సంపత్ చిన్నబోయాడు. తర్వాత మరోసారి ఆలోచించ మని బ్రతిమాలుకున్నాడు.

ఇంటికొస్తూ ఆలోచించింది. పెళ్ళింకా కాలేదు కనక బ్రతిమాలాడు. అదే పెళ్ళయ్యింటే ఆజ్ఞాపించేవాడేమో... యింటికొచ్చాక కాస్త రిలాక్స్ అవుదామ నకుంటుండగానే తాతయ్య దగ్గర్నుంచి ఫోన్. మాట్లాడింది మటుకు అమ్మమ్మే. గాయత్రి పెళ్ళి కొడుకుతో అలా మాట్లాడినందుకు బాధపడింది. ఆ బాధనంతా ఆక్రోశంగా గాయత్రిపై వెళ్ళగక్కింది. పది నిమిషాల పాటు ఆపకుండా మాట్లాడి అలసిపోయి ఫోన్ పెట్టేసింది. మారు మాట్లాడకుండా అక్షింతలన్నీ వేయించుకున్న గాయత్రి నీరసంగా మంచం మీద వాలిపోయింది.

నిద్ర పట్టీపట్టనట్టుగా వుంది. మళ్ళీ ఫోను. చిరాగ్గా తీసింది. అది నవత దగ్గర్నుంచి.

''హాయ్ గాయత్రీ, నేనే. రేపు పొద్దున్నే నీ ఫ్లాట్‌కి వచ్చేస్తున్నాను. జస్ట్ నాల్రోజులంతే. నే వచ్చేదాకా నువ్వింట్లోనే వుండు. ఆఫీస్‌కి వెళ్ళకు. మళ్ళీ తాళం వేసేస్తే కష్టం''.

ఆశ్చర్య పోయింది గాయత్రి.

''నువ్వు రావడమేంటే? మీరిద్దరూ కలిసి వుంటున్నారుగా. అంతలో యేమైంది?''

''రేపు నితీష్ వాళ్ళ పేరెంట్స్ వస్తున్నారే. నాల్రోజుల్లో వెళ్ళిపోతారు. అప్పటిదాకా నీ ఫ్లాట్‌లో వుంటాను. వాళ్ళకి తెలిస్తే కష్టం కదా...''

''అదేంటే? వాళ్ళకి తెలీకుండా కలిసుంటున్నారా మీరు?''

''ఫూల్ లా మాట్లాడకే. పెళ్ళికాకుండా కలిసుంటున్నామంటే యే పేరెంట్స్ ఒప్పుకుంటారు? అయినా ఇదంతా అగ్రిమెంట్‌లో ముందే రాసుకున్నాంలే, మా పేరెంట్స్ వస్తే అతను వెళ్ళాలి, అతని పేరెంట్స్ వస్తే నేను వెళ్ళాలని''.

పేరెంట్స్‌ని ఒప్పించి స్వేచ్ఛగా వాళ్ళిద్దరూ కలిసి వుంటున్నారనుకున్న గాయత్రి నవత చెప్పింది విని తెల్లబోయింది. ఇంకేం స్వేచ్ఛ? పేరెంట్స్‌కి తెలియకుండా కలిసుంటున్నారంటే దానర్థం వాళ్ళకి పేరెంట్స్‌ని ఒప్పించే ధైర్యం లేదనే కదా... అంత కష్టమా పెద్దవాళ్ళని ఒప్పించడం?

పరస్పర విరుద్ధమైన ఆలోచనలతో గాయత్రి మెదడులో నరాలు చిట్లి పోతున్నాయి. యేం చేయాలి తను? యెటు వైపు తన గమ్యం? కళ్ళు మూసుకుంది బాధగా.

చీకటి... కటిక చీకటి... కళ్ళు పొడుచుకున్నా కనిపించనంత చీకటి. గాయత్రి పరుగెడుతోంది. ఊపిరి బిగపట్టి పరుగెడుతోంది.

''తొందరగా వెళ్ళమ్మా'' అంటోంది వెనకనించి అమ్మమ్మ.

''ఇదిగో... ఇటు వైపు...'' త్రోవ చూపిస్తోంది రజని. ఆయాసంతో రొప్పుతూ అటు తిరిగింది.

''కాదు... ఇటు'' పిలుస్తున్నాడు సునీల్.

''అహ... కాదు.. ఇలారా.'' గట్టిగా అరుస్తున్నాడు సంపత్.

''తొందరగా రావే...'' తొందర పెడుతోంది నవత.

పరుగెడుతోంది. ఆగకుండా పరుగెడుతోంది. పళ్ళు బిగపట్టుకుని పరుగెడుతున్న గాయత్రి ఒక్కసారి అకస్మాత్తుగా ఆగిపోయింది. యిదేమిటి? యిక్కడంతా యిలా వుందేంటి? గోతులు... గోతులు.. అన్నీ గోతులే... ఎక్కడ చూసినా గోతులే... ఎవరు రమ్మన్న వైపు తిరిగినా గోతులే... ఏ గోతిలో పడిపోతానో అన్న భయం. ఊపిరందడం లేదు. ఎటు వెళ్ళాలి? ఎటు వైపు?... దూరంగా శబ్దం... చిన్న శబ్దం... చాలా చిన్న శబ్దం... ఎవరికీ వినపడకుండా నోరు నొక్కుకుని పెడుతున్న వెక్కిళ్ళ శబ్దం. అంతచీకటిలో ఆ శబ్దం వింటుంటే అదొకలాంటి భయం. బెంగ. వెన్నుపూసలోంచి వణుకు... ఒక్కసారిగా వులిక్కిపడి లేచింది గాయత్రి.

★


**చిరునామా:**
**జి.ఎస్.లక్ష్మి**
**2-2-23/7/1**
**బాగ్ అంబర్‌పేట,**
**హైదరాబాద్ - 500 013.**